విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

ట్యాంక్ ట్రాక్టర్లు ప్రారంభం

విశాలాంధ్ర-అనపర్తి: ప్రజలకు తాగు నీటి ఇబ్బంది లేకుండా చేయడం కోసమే మంచి నీటి ట్యాంక్ ట్రాక్టర్లు ఏర్పాటు చేసినట్టు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక పంచాయతీ వద్ద రెండు మంచినీటి ట్యాంక్ ట్రాక్టర్లను ఎమ్మెల్యే సత్తి ప్రారంభించారు. రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు), పార్టీ పట్టణ అధ్యక్షులు, రంగంపేట ఇంచార్జ్ నల్లమిల్లి మురళీమోహన్ బాలకృష్ణా రెడ్డి, జడ్పీటీసీ సత్తి గీతా వరలక్ష్మి వెంకటరెడ్డి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, వైస్ ఎంపిపి కర్రి దాసు, జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షులు లు సత్తి శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ ట్రేడ్ యూనియన్ ఉపాధ్యక్షులు మల్లిడి నితిన్ రెడ్డి, ఏజిపి వెలగల లక్ష్మీనారాయణ రెడ్డి, మండల మహిళా విభాగ అధ్యక్షురాలు విజయ కుమారి, టౌన్ సోషల్ మీడియా కో కన్వీనర్ పాదూరి డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర-చాగల్లు: మండలంలోని కలవలపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం ఏడు గంటల నుండి 11 గంటల వరకు 33/11 కె.వి వార్షిక మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. కావున వినియోగదారులు సహకరించవలసిందిగా నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. వీరభద్రరావు శనివారం ఒక ప్రకటనలో కోరారు.

వైఎస్సార్ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీలు

విశాలాంధ్ర-చాగల్లు: చాగల్లు మండలం నుండి వైఎస్ఆర్ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్లో చేరటానికి ఎంపిక పోటీలను విద్యార్థుల కు సోమవారం చాగల్లు జిల్లా పరిషత్ హైస్కూలులో నిర్వహించనున్నట్టు మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి. రాంప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 4,5 తరగతులు చదివే ప్రభుత్వ ప్రవేటు విద్యార్థులు సోమవారం ఉదయం 9. గంటల కు కన్వీనర్ విజయలక్ష్మి కి చాగల్లు హైస్కూలు నందు రిపోర్టు చేయాలని తెలిపారు. మండల స్థాయి లో ఎంపికైన విద్యార్థులు జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొ నాలని అన్నారు. రన్నింగ్ లాంగ్ జంపింగ్‌లలో పోటీలు నిర్వహిస్తారని తెలిపారు.

అమర్నాథ్‌ను హతమార్చడం దారుణం

విశాలాంధ్ర-గోపాలపురం: 10వ తరగతి విద్యార్థి అమర్నాథ్ పై పెట్రోల్ పోసి దారుణంగా హతమార్చడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని పీసీసీ కార్యదర్శి జేష్ఠ సతీష్‌బాబు శనివారం ప్రకటనలో తెలిపారు. విద్యార్థి చావుకు కారణమైన దోషులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. జగన్ నాలుగేళ్ల పాలనలో పోలీస్ వ్యవస్థ అస్తవ్యస్తంగా, అచేతనంగా తయారైందని, రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా లోపించాయన్నారు. దీనికి నైతిక బాధ్యతగా రాష్ట్ర హోంశాఖ మంత్రి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు.

నిద్రిస్తున్న యువకుడి హత్య

విశాలాంధ్ర-నిడదవోలు: నిద్రిస్తున్న యువకుడు హత్యకు గురైన సంఘటన తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో శనివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. నిడదవోలు మండలం సమిశ్రగూడెం చెందిన షేక్ హఫీజ్(23) అనే యువకుడిని గత రాత్రి ఇంటి బయట నిద్రిస్తుండగ గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. మృతుడికి భార్య రెండు సంవత్సరాల కుమారుడు ఉన్నారు. కొవ్వూరు డిఎస్పి వర్మ, నిడదవోలు సీఐ వెంకటేశ్వరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డీఎస్పీ వర్మ మాట్లాడుతూ మృతుడు హఫీజ్ పాత గొడవలు కారణంగానే హత్యకు గురై ఉండ వచ్చునని భావిస్తున్నామని.ఇతర కోణాల్లో కూడా కేసును దర్యాప్తు చేసి హత్య చేసిన దోషులను సాధ్యమైనంత త్వరగా అదుపులోకి తీసుకుంటామని వర్మ తెలిపారు.

ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర-రాజానగరం: మండల కేంద్రమైన రాజానగరంలో ఉపాధి హామీ కూలీలకు వైసిపి నాయకులు శనివారం మజ్జిగ వితరణ చేశారు. ఈ సందర్భంగా వైసీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద మాట్లాడుతూ ఎండలో కష్టపడి పనులు చేస్తున్న శ్రమజీవులకు ఉపశమనం కల్పించేందుకు మజ్జిగ బాటిల్స్ అందించడం సంతృప్తినిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుందేటి ప్రసాద్, ఉప సర్పంచ్ కొల్లి వీర్రాజు,పి.హెచ్.సి చైర్మన్ ప్రగడ చక్రి, ఆకుల శ్రీను, వార్డు సభ్యులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిడదవోలు-దేవరపల్లి బస్సు పునరుద్ధరించండి

విశాలాంధ్ర-నిడదవోలు: విద్యార్థులకు, ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా వున్న నిడదవోలు దేవరపల్లి ఆర్టీసి బస్సు సర్వీస్ ను పునరుద్ధరించాలని పట్టణ ప్రజల సంక్షేమ సంఘం అధ్యక్షులు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు.పల్లంట్ల,చిక్కాల పరిసర ప్రాంతాల విద్యార్థులకు దేవరపల్లి,నిడదవోలు లోని కాలేజిలకు రాకపోకలకు సౌకర్యంగా వుండే బస్సును ప్రస్తుతం రద్దు చేశారు.దీనితో పట్టణ ప్రజల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డిపో మేనేజర్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించి బస్సును తిరిగి పునరుద్ధరించాలని డిపో సూపరెండెంట్ కి వినతి పత్రాన్ని అందజేశారు. జువ్వల రాంబాబు, గారపాటి ప్రసన్న కృష్ణ మైత్రి. ఆనంద్ శ్రీను. శ్రీకర్ సాయి శంకర్ అనిల్ రఘు వరుణ్ ఆకాష్. ప్రవీణ్ అమూల్య తదితరులు పాల్గొన్నారు.

కాశియ్య కుటుంబానికి అండగా నిలుస్తాం

విశాలాంధ్ర-కొవ్వూరు: కొవ్వూరు పట్టణం 1వ వార్డు, శ్రీరామ్ కాలనీ కు చెందిన చొక్కా కాశియ్య కుటుంబ సభ్యులను రాష్ట్ర హెూమంత్రి, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత శనివారం పరామర్శించారు. శ్రీరామ్ కాలనీ కు చెందిన చొక్కా కాశియ్య (65) అనారోగ్యం కారణంగా ఇటీవల మరణించారు. హెూంమంత్రి శనివారం కాశియ్య స్వగృహానికి వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబానికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని మంత్రి భరోసానిచ్చారు. కాశియ్య వంటి మృదుస్వభావిని కోల్పోవడం బాధాకరమని హెూం మంత్రి అన్నారు. వైసీపీ నేతలు పిక్కి శ్రీనివాసు, యజ్జల శ్రీనివాస్ పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలకు బహుమతులు

విశాలాంధ్ర-ఉండ్రాజవరం: మండల కేంద్రం ఉండ్రాజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు ఎండిబి శిరీష, జి ఎస్ ఎన్ ఉమా నరహరి, కే జి వి సురేంద్ర కుమార్ లు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు సొంతం చేసుకుని, 3000, 2000, 1000 నగదు బహుమతి గెలుచుకున్నారు. దీంతోపాటు ఇంటర్ ప్రథమ సంవత్సరం లో జాయిన్ అయిన ఎంపీసీ, సిఇసి విద్యార్థులకు టెక్స్ట్ బుక్స్ పంపిణీ చేశారు. విజేతలకు నగదు బహుమతితో పాటు, మెడల్, సర్టిఫికెట్ అందజేశారు. శనివారం ఉండ్రాజవరం పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, గ్రామ సర్పంచ్ మెండే వెంకటరావు, ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి, విద్యా కమిటీ చైర్మన్ సోమేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వారణాసి విశ్వప్రసాద్, వేలివెన్ను పాఠశాలలో జి.జీవనజ్యోతి, పి బిఎస్ ఎల్.ప్రసన్న, డీ. కోకిలలకు జెడ్‌పిటిసి నందిగం భాస్కర రామయ్య అందజేశారు. టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై అవగాహన

విశాలాంధ్ర-ఉండ్రాజవరం: రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న నవరత్నాలు లో లబ్ధి చేకూరని వారిని గుర్తించి, సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకునేందుకు ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమం పట్ల సచివాలయ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి వి ఎస్ ఆర్ కె రాజు తెలిపారు. మండలంలోని 19 సచివాలయాలను రెండుగా విభజించి తహసిల్దార్ జి కనకరాజు, మండల పరిషత్ అధికారి అధ్యక్షతన జూలై మొదటి తేదీ నుండి లబ్ధిదారులకు కావాల్సిన పత్రాలు, ఈ కేవైసీ లు అందజేయడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. వెలుగు కార్యాలయం లో జరిగిన ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

భూకబ్జాదారులకు జేసీ వత్తాసు

సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు

విశాలాంధ్ర-రాజమండ్రి: తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ రాజమండ్రి రూరల్, బొమ్మూరు పరిధిలో సర్వే నెం.ం 131/2లో తన భూమి కబ్జా చేశారని, రెండు నెలల క్రితం స్పందనలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రాలు ఇచ్చినట్టు సప్పా గోవిందరాజులు తెలిపారు. ఈ విషయంపై ఈనెల 12న జిల్లా జాయింట్ కలెక్టర్ తనను చాంబర్‌లోకి పిలిచి, భూమిపై వాదనాలు వినకుండా జేసీ కలెక్టర్ వెంటనే రికార్డులన్నీ తప్పు అనీ, ఆనాడు రెవెన్యూ అధికారులు మీ దగ్గర డబ్బులు తీసుకుని దొంగ కాగితాలు ఇచ్చారన్నానరు. అంతే కాకుండా జైలుకు పంపుతానని బెదింరిచారన్నారు. తన మీద అనేక కేసులు భూ కబ్జాలు ఉన్నాయి అంటూ జిల్లా అధికారిగా కాకుండా భూకబ్జాదారులకు వత్తాసుగా మాట్లాడారు. వాస్తవంగా భూవివాదం అంటే వివాదానికి సంబంధించిన ఇద్దరిని పిలిచి మాట్లాడాలి గానీ తన భూమిని కబ్జా చేసిన వారితో ఉదయం మాట్లాడి నాతో సాయంత్రం మాట్లాడటం దారుణమని గోవిందరాజులు వాపోయారు. దీనిపై ఉన్నతాధికారులు తక్షణము స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు డిమాండ్ చేశారు.

ప్రతిభకు పేదరికం అడ్డుకాదు

విశాలాంధ్ర-బిక్కవోలు: పేదరికం చదువుకు ఆటంకం కాకూడదని, అటువంటి విద్యార్థులను ప్రోత్సహించే దాతలకు కొదవ లేదని నిరూపించారు కాకినాడకు చెందిన ప్రవాస భారతీయుడు పోకల ఫణిప్రకాశరావు. 2021-22 విద్యా సంవత్సరంలో బిక్కవోలు మండలం కొంకుదురు ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో 566 మార్కులతో పాఠశాల ప్రథమురాలిగా నిలిచిన నిరుపేద కుటుంబానికి చెందిన కురందాసు గణేశ్వరి దాతల సహకారంతో మండపేటలోని ఒక ప్రైవేటు కళాశాలలో చేరింది. 2022-23. విద్యా సంవత్సరంతో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 470 కి 465 మార్కులతో విభాగంలో రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంకు సాధించి కొంకుదురు గ్రామానికి గర్వ కారణంగా నిలిచింది. ఈమె ప్రతిభను గుర్తించిన కొంకుదురు ఉన్నత పాఠశాలకు చెందిన హిందీ ఉపాధ్యాయిని మాసవరపు శిరీష, మణికంఠ దంపతులు వారికి పరిచయం ఉన్న ప్రవాస భారతీయుడు ఫణి ప్రకాశరావు ను సంప్రదించగా సుమారు 50 వేల రూపాయల విలువైన లాప్ టాప్‌ను కాకినాడలో జరిగిన ఒక కార్యక్రమంలో గణేశ్వరికి అందజేసారు. గణేశ్వరి దాత ప్రకాశరావుకు, ప్రోత్సహించిన శిరీష మణికంఠ దంపతులకు కృతజ్ఞతలు తెలిపింది.

గిట్టుబాటు ధర కల్పించాలి

విశాలాంధ్ర-రాజానగరం: రైతు ప్రభుత్వం అని డప్పులు కొట్టుకుంటున్న వైసీపీ ప్రభుత్వం మామిడి, జీడిమామిడి రైతులకు చేసింది ఏమీ లేదని జనసేన నాయకులు భక్తుల బలరామకృష్ణ అన్నారు. జీడి మామిడి,మామిడి సాగు చేసే రైతులకు ప్రభుత్వం తక్షణమే గిట్టుబాటు ధర కల్పించాలన్నారు.మండల కేంద్రమైన రాజానగరంలోని గాంధీ బొమ్మ కూడలి వద్ద సమీప గ్రామాల రైతులు, జనసేన నాయకులతో కలిసి శనివారం ధర్నా నిర్వహించారు. దీనిలో భాగంగా మానవహారం నిర్మించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అక్కడ నుండి ర్యాలీగా బయలు దేరి వెళ్లి ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. నాయకులు కిమిడి శ్రీరాం, గళ్ళ రంగ, నాతిపం దొరబాబు,రైతులు పసుపులేటి గోవిందు, నాతిపాం భావన్నారాయణ, అబ్బిరెడి త్రిమూర్తులు, సాంగుల పాండవులు,వాసంశెట్టి చిన్న అప్పారావు, గుర్రాల రాంబాబు,కెవికె రావు, గండి సత్యనారాయణ, జనసేన నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యానాంలో పుదుచ్చేరి సీఎస్ పర్యటన

విశాలాంధ్ర-యానాం: పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రాజీవ్ వేర్మ శుక్రవారం సుడిగాలి పర్యటన జరిపారు. ఈ సందర్భంగా ఆయన పలు ప్రాంతాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంవత్సరాల తరబడి దీర్ఘకాలిక సమస్యగా ఉన్న కనకాలపేట డంపింగ్ యార్డు తొలగింపు డిమాండ్ నేపథ్యంలో ఆయన డంపింగ్ యార్డును క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌తో కలిసి పరిశీలించారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా వైద్యంను నిరాకరించే ఆసుపత్రులను బ్లాక్ లిస్టో పెట్టి భారత ప్రభుత్వానికి తెలుపుతామన్నారు. వికలాంగులకు సర్టిఫికెట్లు ఇవ్వాలని ఆదేశించారు. మరో నెలరోజుల్లో మళ్లీ సమీక్ష ఉంటుందని అన్నారు. పుదుచ్చేరి ఇన్చార్జి కలెక్టర్ ఎల్ కుమార్, హెల్త్ డైరెక్టర్ ఉదయ్ కుమార్, ఆర్ఎఓ మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ ద్విజ్ గోయల్, పిడబ్ల్యుడి, విద్య, వైద్య, విద్యుత్ తదితరశాఖల అధికారులు పాల్గోన్నారు.

జక్కంపూడి వ్యక్తి కాదు శక్తి

విశాలాంధ్ర-సీతానగరం: జక్కంపూడి రామ్మోహనరావు అంటే వ్యక్తి కాదు ఒక శక్తి అని సీతానగరం గ్రామ ఉప సర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ అన్నారు. సీతానగరం మండలంలో గల ఇనుగంటివారిపేట గ్రామంలో జక్కంపూడి రామ్మోహనరావు విగ్రహం ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. విగ్రహం ధ్వంసం చేసింది ఎవరైనా చట్ట ప్రకారం శిక్ష పడే వరకు వదిలేది లేదని ఆయన హెచ్చరించారు. ఆత్మ చైర్మెన్ డాక్టర్ బాబు, చింతపూడి వీరబాబు, వలవల వల్లీ, బాబు నాగేశ్వరరావు, మట్ట మునియ్య, కోత శ్రీనివాస్ మొదలగు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే నష్టపరిహారం ఇవ్వాలి

విశాలాంధ్ర-కొత్తపేట: ధాన్యం కొనుగోలు సంబంధించి రైస్ మిల్లులు వద్ద దోపిడీ గురైన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించాలని కొత్తపేట టీడీపీ డిమాండ్ చేసింది. పంట మునిగింది పరిహారం అందించండి కార్యక్రమంలో భాగంగా కొత్తపేట మండలం అవిడి గ్రామంలో పంట నష్టాలు సంబంధించి రైతుల నుండి టిడిపి రైతు విభాగం వివరాలను సేకరించింది. సాగుచేసిన భూమి, పండిన పంట పంట, నష్టం, హమాలి ఖర్చులు, రవాణా ఖర్చులు,కల్లం ఖర్చులు వివరాలను దరఖాస్తు ద్వారా సేకరించారు. మండల టిడిపి అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు, మండల రైతు అధ్యక్షుడు చోడపనీడి భాస్కరరావు, అవిడి గ్రామ పార్టీ అధ్యక్షుడు సూరవరపు రామకృష్ణ, మాజీ జెడ్పిటిసి రెడ్డి రామకృష్ణ, రెడ్డి తాతాజీ, ధర్నాల రామకృష్ణ, బందారు సత్తిబాబు, విళ్ళ మారుతి, బొక్కా కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురంలో జగనన్న ఆణిముత్యాలు

విశాలాంధ్ర-పిఠాపురం: జగనన్న ఆణిముత్యాలు శనివారం పిఠాపురం స్థానిక ఆర్ఆర్‌బి హెచ్ ఆర్ పాఠశాలలో నిర్వహించారు. పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొర బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పదో తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు, షీల్డ్ అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం విద్యార్థుల తల్లిదండ్రులు, వైసీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదాతలకు అభినందన

విశాలాంధ్ర-కరప: యువత ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవాటు చేసుకోవాలని డాక్టర్ శారదా దేవి పేర్కొన్నారు. కరప గ్రామానికి చెందిన కె మహాలక్ష్మి, కె సూర్యకుమారి ఆసుపత్రిలో ఇన్ పేషెంట్గా చేరి సర్జరీ చేసేందుకు రక్తం అవసరం కావడంతో అడపా సతీష్, ఎరమాటి రాజు ఇద్దరు యువకులు కరప గ్రామ మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు కోరిక మేరకు వచ్చి వెంటనే రక్తదానం చేశారని డాక్టర్ శారద దేవి తెలిపారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

ప్రతి సోమవారం డయల్ యువర్ కమిషనర్

విశాలాంధ్ర-కాకినాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చెప్పారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 గంటల మధ్యలో ప్రజలు కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నెంబర్ 08842357800 నెంబర్‌కు కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చునన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. 10:30 నుంచి స్పందన కార్యక్రమం యధావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చిన శంకర్ల పూడిలో మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-ప్రత్తిపాడు: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం చిన్న శంకర్లపూడిలో ప్రత్తిపాడు నియోజకవర్గ బీసీ ఐక్య సంఘర్షణ సమితి కన్వీనర్ ఏపూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో వంద మందికి పైగా దాతలు ముందుకు రావడం అభినందనీయమని కాకినాడ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ వైడి రామారావు అన్నారు. ఈ సందర్భంగా ఏపూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల ఒడిస్సా రాష్ట్రంలో జరిగిన రైలు ప్రమాదంలో గాయపడ్డ వందలాది మంది క్షతగాత్రులకు సరైన సమయంలో సరిపడ రక్తం సరఫరా చేయకపోవడం వల్లే వందలాది మరణాలు చోటుచేసుకున్నాయన్నారు. అనంతరం బ్లడ్ డొనేషన్ చేసిన వారికి ఫ్రూట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది బుగత శివ, పైల సుభాష్ చంద్రబోస్, మహిళా యువ నాయకురాలు అనూష యాదవ్, మాజీ సర్పంచ్ గొల్లపల్లి అమలావతి, షేక్ సుభాన్, ఏపూరి సతీష్, తంగేళ్ల ఆనంద్, చనిబోయిన బుజ్జి, గొల్లపల్లి నాని, నైదాన రఘు, శీరం శ్రీను, ఓమ్మి గంగరాజు తదితర రెడ్ క్రాస్ వైద్య సిబ్బంది, ఏపూరి యూత్ తదితరులు పాల్గొన్నారు.

ఏంఎంసీ చైర్మన్‌గా చిట్టిబాబు

విశాలాంధ్ర-కాకినాడ: కాకినాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన, వైయస్సార్సీపి 18వ డివిజన్ ఇంచార్జ్ ధోని చిట్టిబాబుని శనివారం రాష్ట్రంలోని వివిధ బిసి సంఘాల నాయకుల చేతులమీదుగా మల్లాడి రామారావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆఫీసు నందు ఘనంగా సత్కరించడం జరిగినది. మల్లాడి రామారావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మల్లాడి రాజేంద్రప్రసాద్, జాతీయ బీసీ ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షులు గూడూరి వెంకటేశ్వరరావు, మత్స్యకార పరిరక్షణ సమితి అధ్యక్షులు ప్రెసింగి ఆదినారాయణ, ఆంధ్రప్రదేశ్ బిసి ఫెడరేషన్ సమన్వయకర్త పప్పు దుర్గా రమేష్, బహుజన యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షులు చొల్లంగి వేణుగోపాల్, 93 బీసీ కులాల ఐక్యవేదిక అధ్యక్షులు మాకిరెడ్డి భాస్కర గణేష్, ధన్వంతరి నాయి బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు సుందరపల్లి వివిఎస్ గోపాలకృష్ణ,తూరంగి మాజీ సర్పంచి బలగం ప్రసన్నకుమార్, మత్స్యకార నాయకులు పెనుపోతు తాతారావు, మాజీ కార్పొరేటర్ కామాడి దశరథ్, విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు ఆవుపాటి ఉమాశంకర్, పెరిక సంఘం అధ్యక్షులు వనపర్తి బద్రి, బీసీ నాయకులు మెంటారావు, అగ్నికుల క్షత్రియ యూత్ నాయకులు మల్లాడి రాజు, బిజెపి నాయకులు కోక్కిలగడ్డ గంగరాజు, సేరు వీరబాబు తదితరులు హాజరయ్యారు.

ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకుందాం

విశాలాంధ్ర-కాకినాడ: వామపక్షాల పోరాటాల ఫలితంగా ఏర్పడిన ఉపాధి హామీ చట్టాన్ని ఉపాధి కూలీలు పోరాటాల ద్వారా కాపాడుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తాటిపాక మధు ,కేశవరం అప్పలరాజు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం ఉదయం కాకినాడ రూరల్ అందూరు కొమరగిరి మల్లం ప్రాంతాల్లో వ్యవసాయ కూలీల వద్దకు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకుని సభ్యత్వం కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి తాటిపాక మధు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉపాధి హామీ చట్టం ప్రమాదంలో పడింది అన్నారు. వచ్చే ఎన్నికల్లో బిజెపికి బుద్ధి చెప్పాలని అప్పుడే ఉపాధి హామీ చట్టం నిలబడుతుందని మధు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహా సభలు బాపట్ల జరుగుతున్నాయని, త్వరలో కాకినాడ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని మధు పిలుపునిచ్చారు. ఇంకా ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అశోక్, సువర్ణ, రాజు, శ్యామ్, భీమారావు, అంబేద్కర్, సంతోష్, అమ్మ నేరేళ్ళమ్మ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి జగన్‌ను సీఎం చేయాలి

విశాలాంధ్ర-కిర్లంపూడి: గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రజలకు నవరత్నాల పేరుతోఎన్నో ప్రజా సంక్షేమ పథకాలు అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రుని చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని మాజీ మంత్రి తోట నరసింహం అన్నారు. కిర్లంపూడి మండలం ఎస్ తిమ్మాపురం గ్రామం పర్యటించారు. సుదీర్ఘకాలం తర్వాత గ్రామానికి విచ్చేసిన తమ ప్రియతమ నాయకుడు తోట నరసింహం, ఆయన తనయుడు రాంజీలకు గ్రామస్తులు అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం పాదయాత్రగా బయలుదేరి స్థానిక ఎస్సీ పేటలో ఉన్న అంబేద్కర్, జగజ్జీవన్ రామ్ విగ్రహాలకు రాంజీ చేతుల మీదగా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వైసిపి నాయకులు ఓలేటి రాజేశ్వరరావు స్వగృహంలో వైసీపీ నాయకుల తోనూ, కార్యకర్తలతోనూ, ఆయన అభిమానులతోనూ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తోట నరసింహం మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాజకీయాల కతీతంగా, కుల, మతాలకతీతంగా ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. జగ్గంపేట ఎమ్మెల్యేగా మంత్రిగా పార్లమెంటు సభ్యుడిగా నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడం జరిగిందని, ప్రజల సహకారంతో భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. తోట రాంజీ, అత్తులూరి సాయిబాబు, తోట బాబ్జి, మందేటి పెద్దిరాజు, రాసన బోయిన శ్యాం, మందేటి డేవిడ్ రాజ్, దాని యేలు, తుమ్మల వీరబాబు, తుమ్మల రాజా, వైసిపి నేతలు తోట నరసింహం అభిమానులు పాల్గొన్నారు.

బాలదుర్గమ్మ ఆలయంలో ఘనంగా తులాభారం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి బాలదుర్గమ్మ ఆలయంలో తులభార కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది తణుకు పట్టణానికి చెందిన మద్దుల అవినాష్ మాధవి దంపతుల కుమారుడు అయాన్ కార్తికేయకు పటిక బెల్లంతో తులాభారం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు అమ్మవారి అష్టోత్తర నామం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పైడికొండల సత్యనారాయణ కమిటీ సభ్యులు కామిశెట్టి దుర్గారావు కామిశెట్టి మంగ గట్టు సత్యనారాయణమూర్తి గట్టు రమాదేవి మహిళా సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అమెరికా వారి సహకారంతో మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర-జగ్గంపేట: జగ్గంపేట వాసవి క్లబ్ చలివేంద్రంలో అమెరికాలో ఉండే వారి సహకారంతో శనివారం బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. స్వర్గీయ విశ్వేశ్వరరావు, రత్నశ్రీ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమార్తె,అల్లుడు వందన, సతీష్‌లు 86వ రోజు మజ్జిగ పంపిణీకి సహాయం అందించినట్లు జగ్గంపేట ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షులు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) తెలిపారు. ఎక్కడో విదేశాల్లో ఉన్న వారు సైతం ఇక్కడ జరుగుతున్న కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా తెలుసుకుని సహయన్ని అందించారన్నారు.

పుల్లేటికుర్రులో అత్తపై అల్లుడి దాడి

విశాలాంధ్ర-అంబాజీపేట: అదనపు కట్నం కోసం ఇబ్బంది పెడుతున్న భర్త వేధింపులు తట్టుకోలేక పుట్టింటికి వచ్చిన భార్య, అత్తలతో ఘర్షణ పడి అత్తను కొట్టిన అల్లుడిపై కేసు నమోదైంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పుల్లేటికుర్రు బీరవారిపేటకు చెందిన నాగలక్ష్మికి అద్దంకివారిలంకకు చెందిన దాకే నాగేశ్వరరావుకు తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. నాగేశ్వరరావు అదనపు కట్నం కోసం నాగలక్ష్మిని ఇబ్బంది పెట్టడంతో ఆమె పుట్టింటికి పుల్లేటికుర్రు బీరవారిపేటకు వచ్చేసింది. గురువారం రాత్రి నాగేశ్వరరావు బీరవారిపేటకు వచ్చి నాగలక్ష్మితో పాటు ఆమె తల్లితో ఘర్షణ పడి కొట్టాడు. నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాబోయే ఎన్నికల్లో బూత్ కమిటీలదే కీలకపాత్ర

విశాలాంధ్ర-జగ్గంపేట: సార్వత్రిక ఎన్నికలలో విజయం సాధించాలంటే బూత్ కమిటీలు కీలకపాత్ర పోషించాలని టీడీపీ ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ అన్నారు. నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో జగ్గంపేట టౌన్ 5, 6 బూత్ కమిటీ ఇన్చార్జిలు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. టీడీపీ మహానాడులో ప్రకటించిన మేనిఫెస్టోలను ప్రతి ఇంటికి పంపిణీ చేయాలన్నారు. ఎస్‌వివిఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, కొత్త కొండబాబు, వేములకొండ జోగారావు, బూత్ కమిటీ ఇన్చార్జ్‌లు వైభోగుల కొండబాబు యాదవ్, దేగల సత్తిబాబు, మానేపల్లి సాయి, బూత్ కమిటీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను పరిశీలన

విశాలాంధ్ర-ఏలేశ్వరం: మండలం యర్రవరంలో ఉపాధి హామీ పనులును పరిశీలించిన ఉభయగోదావరి జిల్లాల పంచాయితీరాజ్ జోనల్ ఇంచార్జ్, ఏలేశ్వరం మండల అధ్యక్షుడు (ఎంపిపి) గొల్లపల్లి నరసింహమూర్తి(బుజ్జి). వారి దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఎంపిపిగా నాకున్న హక్కులను అణగ తొక్కుతున్నారు. ఎంపిపిగా పంచాయితీ రాజ్ చట్టం ప్రకారం మండలంలో అభివృద్ధి పనులు పరిశీలించేందుకు వెళ్ళే హక్కు లేదా అని ఆయన వాపోయారు. అనంతరం తిరుమాలి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నాడు-నేడు పనులను పరిశీలించి నాణ్యమైన నిర్మాణం చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు.

కమ్యూనిస్టు పార్టీ నాయకురాలు మంగాయమ్మ మృతి

విశాలాంధ్ర-రాజోలు: మలికిపురం మండలం దిండి గ్రామం చెందిన కమ్యూనిస్టు పార్టీ నాయకురాలు, మహిళా సమాఖ్య నాయకురాలు, విశ్రాంత ఉపాధ్యాయురాలు కామ్రేడ్ దేవ మంగాయమ్మ శనివారం మరణించారు. ఆమె అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడ ఆంధ్ర హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆమె తన భర్త కమ్యూనిస్టు సీనియర్ నేత దేవ ముసలయ్యతో కలిసి పలు కమ్యూనిస్టు ఉద్యమాలలో పాల్గొన్నారు. ఆమె మృతి పట్ల రాజోలు ఏరియా సిపిఐ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు విప్లవ జోహార్లు అర్పించారు. ఆమె నేత్రాలు నేత్రనిధి బ్యాంకుకు, భౌతిక దేహాన్ని వైద్య పరిశోధన నిమిత్తం పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలకు అప్పగించడం జరిగిందిని ఆమె కుమార్తె ప్రముఖ వైద్యులు డాక్టర్ డి సుజాత, అల్లుడు డాక్టర్ వి సదానందం, కుమారులు దేవ రాజేంద్ర ప్రసాద్, (న్యాయవాది), దేవ రాధాకృష్ణ (ఇంజనీర్) తెలిపారు.

కరెంటు తీగలు తగిలి గడ్డివామి దగ్ధం

విశాలాంధ్ర-రాజోలు: నియోజకవర్గంలోని మలికిపురం మండలంలోని మలికిపురం సంత మార్కెట్ లోంచి గడ్డి లోడుతో వెళుతున్న లారీ పైన ఉన్న గడ్డి కరెంటు తీగలు తగిలి పూర్తిగా కాలిపోయిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఆ సమయంలో రహదారి మొత్తం పొగలు అలుముకున్నాయి. వెంటనే స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేయడంతో వారు స్పందించి సంఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ఎలాంటి ప్రాణా నష్టం జరగలేదు.

భక్తజన సంద్రమైన వాడపల్లి

విశాలాంధ్ర-ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయం శనివారం భక్తజన సంద్రమైంది. వేకువజామునుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి మాడ వీధుల్లో ఏడు ప్రదక్షిణలు పూర్తిచేసి స్వామిని దర్శించుకున్నారు. స్వామి వారి సుప్రభాత సేవ, తొలి హారతి అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. దేవస్థానం చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు, ధర్మకర్తల మండలి సభ్యుల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసారు. భక్తులు స్వామిని దర్శించుకున్న అనంతరం తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. శనివారం రోజున ప్రత్యేక దర్శనం ద్వారా ఆదాయం రు.8,21,600/-, అన్నప్రసాద విరాళం ఆదాయం రు.1,82,942/-, సేవలు వల్ల ఆదాయం రు.29,000/- లడ్డూ విక్రయిం రు.2,32,455/-, విరాళములు ద్వారా ఆదాయం రు.3,884/-, వెరసి రు.12,69, 881/-లు ఆదాయం వచ్చినది అని ఆలయ ఈఓ సత్యనారాయణరాజు తెలిపారు.

మట్టిలో మాణిక్యం ముత్యాలరావు

విశాలాంధ్ర-ఆత్రేయపురం: జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా తూర్పుగోదావరి జిల్లాలో సెకండ్ ఎంపీసీ విభాగంలో జిల్లా టాపర్‌గా ధవలేశ్వరం గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ విద్యార్థి బివిఏ ముత్యాలరావు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా 50000 ప్రైజ్ మనీ అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా డివిఓ జెవిఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు కె రమేష్ బాబు, విఎస్ శేఖర్ బాబు, కే ఉమా శంకర్, సత్తి ఆది రెడ్డి, కె వెంకటేశ్వర్లు అధ్యాపకులు, ఇతర అధ్యాపక, ఆఫీసు సిబ్బంది విద్యార్థిని అభినందించారు.

జులై 1 నుంచి గ్రహణం మొర్రి చికిత్సలు

విశాలాంధ్ర-కాకినాడ: ముత్తూట్ పప్పాచన్ ఫౌండేషన్, కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి భాగస్వామ్యములో రాష్ట్రానికి చెందిన చిన్నారులు, యువకులకు "మిషన్ స్మైల్" పేరిట ఉచిత గ్రహణం మొర్రి శస్త్ర చికిత్సలను జూలై 1నుండి 4వ తేదీ వరకు అందిస్తోందని డిఎంఈ డాక్టర్ డివిఎస్ఎల్ నరసింహం, సూపరిండెంట్ డాక్టర్ హేమలత దేవిలు తెలిపారు. శనివారం కాకినాడ ఆసుపత్రిలో విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు విజయవాడ, విజయనగరం, విశాఖపట్నం మిషన్ల ద్వారా ఇంతవరకు ఆంధ్రప్రదేశ్లో 520 మించి రోగులతో మొత్తం రాష్ట్రంలో 1200కు మించి శస్త్ర చికిత్సలు చేశారని చెప్పారు. జూలై 1వ తేదీన సుమారు 70-80 మంది రోగులు ప్రాథమిక పరీక్షల నిమిత్తం ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. అనంతరం జూలై 2 నుండి 4 వరకు అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు జరుగునన్నారు. నాలుగు రోజులలో నిర్వహించబడే సమగ్ర గ్రహణం మొర్రి శస్త్ర చికిత్సల శిబిరం (మిషన్) ద్వారా ప్లాస్టిక్ సర్జరీ, అనస్థీషియాలజీ, పీడియాట్రిక్స్, డెంటిస్ట్, స్పీచ్ లాంగ్వేజ్, పేథాలజీ, నర్సింగ్ వంటి విభాగాలలో దేశానికి చెందిన వైద్య నిపుణులతో సుమారు 50 మందికి మించి శస్త్ర చికిత్స అందించగలమని తెలిపారు. ముత్తూట్ పప్పాచన్ ఫౌండేషన్ (ఎంపిఎఫ్) అవసరమైన సహాయ సహకారాలు అందచేస్తుందన్నారు. రోగులకు ఉచిత రవాణా సదుపాయం, ఆహారం, నివాసం, వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సలు, మందులు అందించనున్నట్లు వెల్లడించారు. శస్త్ర చికిత్స అనంతరం రోగులకు ఉచిత శస్త్ర చికిత్సానంతర సదుపాయాలు కల్పిస్తారని, కాకినాడకు దగ్గరగా ఉన్న జిలాలలో సుమారు 35-40 మంది రోగులకు ఆసుపత్రి వర్గాలు గుర్తించామని నరసింహం, హేమలతలు చెప్పారు. సంస్థ ప్రతినిధులు జోనల్ హెడ్ మణి కిరణ్, నేషనల్ ప్రోగ్రాం హెడ్ రెహమాన్, వైద్యులు రత్న భూషణ్, విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక విధానాలు: గీత

విశాలాంధ్ర-కాకినాడ: భావి భారత పౌరుల సమగ్రాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక విధానాలను అమలుచేస్తున్నారని కాకినాడ ఎంపీ వంగా గీత అన్నారు. శనివారం కాకినాడ జేఎన్‌టీయూ అలుమ్ని ఆడిటోరియంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జగనన్న ఆణిముత్యాలు జిల్లాస్థాయి కార్యక్రమం జరిగింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రతిభ చూపిన ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు అవార్డులు, నగదు పురస్కారాలు అందించే ఈ కార్యక్రమానికి కాకినాడ ఎంపీ వంగా గీత, జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ విప్పర్తి వేణుగోపాలరావు, కాకినాడ గ్రామీణ శాసనసభ్యులు కురసాల కన్నబాబు, కాకినాడ అర్బన్ శాసనసభ్యులు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, రాష్ట్ర మాల కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పెదపాటి అమ్మాజీ, కుడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, కాకినాడ నగరపాలక సంస్థ మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, జిల్లాపరిషత్ ఇన్‌ఛార్జ్ సీఈవో ఎ.రమణారెడ్డి, కాకినాడ జిల్లా డీఈవో కేఎన్‌వీఎస్ అన్నపూర్ణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ వంగా గీత మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రుల కంటే ఎక్కువగా ఆలోచించే ముఖ్యమంత్రి ఉండటం పిల్లల అదృష్టమని పేర్కొన్నారు. విద్య, వైద్యానికి సంబంధించి పేదలు పడుతున్న ఆవేదనను అర్థం చేసుకొన్న మొట్టమొదటి ముఖ్యమంత్రిగా నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి నిలిచారని పేర్కొన్నారు. ఇప్పుడు తండ్రి చూపిన బాటలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్య, వైద్య రంగంలో ఒక్క అడుగు కూడా వెనక్కు వేయకుండా పేదలపై పడుతున్న భారాన్ని పూర్తిగా తగ్గించారన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు అన్ని వర్గాల్లోనూ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్నాయని అన్నారు. 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో ఎప్పుడూ, ఎక్కడాలేని విధంగా గౌరవ ముఖ్యమంత్రి వాలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థలను తీసుకొచ్చి అవినీతి రహితంగా, అత్యంత పారదర్శకంగా పేదలకు సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు మంచి భవిష్యత్తును సొంతం చేసుకోవాలని సూచిస్తూ ఎంపీ వంగా గీత అవార్డుల విజేతలకు శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా మాట్లాడుతూ జిల్లాస్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో పదో తరగతి విభాగంలో ఎనిమిది మేనేజ్‌మెంట్ల పరిధిలోని పాఠశాలల నుంచి టాప్-3 ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేయడం జరుగుతోందని ఫస్ట్ ర్యాంకర్‌కు గోల్డ్ మెడల్, సర్టిఫికెట్‌తో పాటు 50 వేల రూపాయల నగదు బహుమతిబీ సెకండ్ ర్యాంకర్‌కు సిల్వర్ మెడల్, సర్టిఫికెట్‌తో పాటు 30 వేల రూపాయల నగదు బహుమతిబీ థర్డ్ ర్యాంకర్‌కు బ్రాంజ్ మెడల్, సర్టిఫికెట్‌తో పాటు 15 వేల రూపాయలు అందించినట్లు తెలిపారు. ఇంటర్మీడియెట్ విభాగంలో ఏడు మేనేజ్‌మెంట్ల పరిధిలోని కళాశాలల నుంచి ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ/ఎంఈసీ గ్రూపుల్లో ఒక్కో గ్రూపు నుంచి ఫస్ట్ ర్యాంకర్‌కు గోల్డ్ మెడల్, సర్టిఫికెట్, 50 వేల రూపాయల నగదు బహుమతిని అందించడం జరుగుతోందన్నారు. జిల్లాస్థాయిలో మొత్తం 37 మందికి అవార్డులు, నగదు పురస్కారాలు అందించినట్లు తెలిపారు. విద్యార్థుల విజయంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర కూడా ఉంటుందని.. వారి ప్రోత్సాహం పల్లె విద్యార్థులు ఈ స్థాయిలో ప్రతిభ చూపగలిగారని.. అందుకే పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులను, ర్యాంకర్ల తల్లిదండ్రులను కూడా ఈ సందర్భంగా సత్కరిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రపంచ వ్యాప్త అవకాశాలను అందిపుచ్చుకోవాలనే లక్ష్యంతో విద్యార్థులకు రైజ్ కార్యక్రమం ద్వారా ఇంగ్లిష్ నైపుణ్యాలు పెంపొందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు ఈ కార్యక్రమం ద్వారా 12 వేల మందికి శిక్షణ అందించడం జరిగిందన్నారు. రాష్ట్రస్థాయిలో డా. బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో మొదటి స్థానాన్ని కాకినాడ గ్రామీణం, పి.వెంకటాపురం గురుకుల పాఠశాల విద్యార్థిని దడాల జ్యోత్స్న సాధించినందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. జిల్లాస్థాయి అవార్డుల విజేతల్లో 37 మందిలో 30 మంది అమ్మాయిలే ఉన్నారంటే అమ్మాయిలకు ఏ మేరకు ప్రోత్సాహం అందుతోందో అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని.. రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తేవాలని కలెక్టర్ డా. కృతికా శుక్లా ఆకాంక్షించారు. **పండగ వాతావరణంలో అవార్డుల ప్రదానం :** జిల్లాస్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పండగ వాతావరణంలో విద్యార్థులకు కాకినాడ ఎంపీ వంగా గీత, జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ విప్పర్తి వేణుగోపాలరావు, కాకినాడ గ్రామీణ శాసనసభ్యులు కురసాల కన్నబాబు, కాకినాడ అర్బన్ శాసనసభ్యులు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కుడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, రాష్ట్ర మాల కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పెదపాటి అమ్మాజీ, కాకినాడ నగరపాలక సంస్థ మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, కాకినాడ డీఈవో కేఎన్‌వీఎస్ అన్నపూర్ణ తదితరులు అవార్డులు, నగదు పురస్కారాల చెక్‌లను అందజేసి, అభినందనలు తెలియజేశారు. అదే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను సత్కరించారు. డీఈవో కేఎన్‌వీఎస్ అన్నపూర్ణను సత్కరించారు. కార్యక్రమంలో డీవీఈవో జీజీకే నూకరాజు, డీసీవో ఎ.మురళీకృష్ణ, జిల్లా గిరిజనసంక్షేమ అధికారి ఎ.విజయశాంతి, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు హాజరయ్యారు.

టీడీపీ ఆధ్వర్యంలో పలకరింపు

విశాలాంధ్ర-ప్రత్తిపాడు: టిడిపి పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సమ స్యలు తెలుసుకోవడానికి "పలక రింపు 'కార్యక్రమంలో భాగంగా కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం, మరియు గిరిజన సబ్ ప్లాన్ గ్రామాలు కితమూరు పేట, బురద కోట, బాపన్న దొర, కొండపల్లి గ్రామాల్లో పర్యటించిన ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ వరుపుల సత్య ప్రభకు ఘన స్వాగతం పలికిన గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు ఈ సందర్భంగా సత్యప్రభ మాట్లాడుతూ నా భర్త అయిన వరపుల రాజా ఆశయాలకి, మీ అందరి ఆశలకి వారధిగా పనిచేస్తాను అన్నారు. ప్రతీ ఒక్కరూ సహకరించాలని ఎలాంటి వైషమ్యాలు లేకుండా పనిచేయాలి అన్నారు. టిడిపి మండల అధ్యక్షులు అమరాధి వెంకట్రావు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు కొమ్ముల కన్నబాబు, నియోజకవర్గ టిడిపి నాయకులు ముదునూరి మురళి రాజు, నిమ్మల రాంబాబు, లోండ లోవరాజు, రీసు సత్తిబాబు, గోంప ప్రవీణ, ఇళ్ల అప్పారావు, మిరియాల శ్రీను, చీకట్ల నాని, నిమ్మల అప్పారావు కోలా తాతబాబు, జువ్వల దొరబాబు, కార్యకర్తలు టిడిపి అభిమానులు మహిళలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

మరిడమ్మ జాతర ప్రారంభం

విశాలాంధ్ర-పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా, తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన మరిడమ్మ అమ్మవారి జాతర శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఆషాడ మాసంలో 37 రోజుల పాటు నిర్వహించే అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా, గరగర నృత్యం అమ్మవారి రథం బ్యాండ్ మేళాలు కోలాటాలతో అమ్మవారి సంబరం అంబరాన్నంటింది. దేవాదాయ శాఖ డిసి విజయరాజు,డిఈఒ పులి నారాయణమూర్తి, మునిసిపల్ చైర్ పర్సన్ బొడ్డు మంగతాయారు, వైస్ చైర్మన్‌లు నెక్కంటి సాయిప్రసాద్, కనకాల మహాలక్ష్మి ప్రారంభించారు. వారికి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ రామ్మోహన్‌రావు, ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మజీ, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఘన స్వాగతం పలికారు. దేవాదాయ శాఖ అధికారులు బాలయ్య సిబ్బంది అమ్మవారిని దర్శించుకుని, కొబ్బరికాయ కొట్టి జాతరను ప్రారంభించారు. అనంతరం గరగల నృత్యం, కోలాటం, పులి ఆట, భక్తులను ఎంతగానో అక్కట్టుకున్నాయి. అనంతరం కోట ముందు పురాతన చరిత్ర కలిగి మరిడమ్మ అమ్మవారు వెలిసియున్నారన్న ఆలయంలో గరగని ఎత్తుకుని పాత పెద్దాపురం సంబరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కనకాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, కౌన్సిలర్లు విద్యపు రాజశేఖర్, విడదాసరి రాజా, చల్లా చినవీర్రాజు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు తూతిక రాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగుల సమస్యలు డీఎంఈకి వినతి

విశాలాంధ్ర-కాకినాడ: మిషన్ స్మైల్ ప్రోగ్రాంపై జిజిహెచ్ కాకినాడకు విచ్చేసి యున్న డిఎంఇ డా డివిఎల్ నరసింహారావుకి జిజిహెచ్ కాకినాడ ఉద్యోగుల సమస్యలపై ఆయనకు గోదావరి జిల్లాల ఆరోగ్య ప్రధాయనిగా సేవలందిస్తున్న గవర్నమెంట్ జనరల్ హాస్పటల్ కాకినాడలో గత 40సం. క్రితం నియమించబడిన స్టాఫ్‌నర్స్ సహాయకులైన ఎంఎన్ఒస్ ఎఫ్ఎన్ఒస్ నాగ్గవ తరగతి సిబ్బంది ఓల్డ్‌బెడ్ స్ట్రింత్ ప్రకారాలుతోనే నేటికి కొనసాగించుచున్నారు. గతం కంటే జిజిహెచ్ కెకెడికు వచ్చే రోగుల సంఖ్య 3రెట్లు పెరిగినది. అలాగే ఒపి, బ్లాక్స్, వార్డులు, ఇన్ సెంటివ్ కేర్ యూనిట్లు ఎఎంసియు, ఎస్ఐసియులు, ఆర్ఐసియులు, ఆపరేషన్ థియేటర్సు వంటి మొదలగు బ్లాకులు పెరిగినవి. కావున ప్రస్తుత బెడ్ స్ట్రెంత్ ప్రకారాలు పై కేటగిరి ఉద్యోగులను నియమించాలి. ఇన్ సర్వీస్ క్యాండిటేస్ట్‌గా, ల్యాబ్ టెక్నిషియన్ ట్రైనింగ్ పూర్తి చేసిన జిజిహెచ్ కెకెడి మరియు కెఎంసి కెకెడి ఉద్యోగులకు యాస్ ఫర్ జిఒఎంఎస్ నెం.243 హెచ్ఎం & ఎల్‌డబ్ల్యు డిపార్ట్‌మెంట్ ప్రకారము ల్యాబ్ టెక్నిషియన్‌కి ప్రమోషన్స్ ఇప్పించవలసిదినగా కోరుతున్నారు. జిజిహెచ్ కెకెడి వార్డు, ఒపిస్ ల్యాబ్స్ నందు నేటికి మాన్యువల్ పద్దతిలోనే రక్త పరీక్షలు చేయుచున్నారు. అధిక సంఖ్యలో ప్రభుత్వం వారు నిర్వహించు ఆరోగ్యశ్రీ పథకాల వల్ల అధిక సంఖ్యలో రోగులు వస్తున్నందున మాన్యువల్ పద్దతిలో రక్త పరీక్షలు నిర్వహించడం వలన సమయం ఎక్కువ పడుచున్నందువలన పేషెంట్స్‌కి ఇబ్బంది కలుగుచున్నది. కావున (సిబిపి) కాల్ కంట్రోల్ ఎనలైజేషన్ 6 ఇప్పించవలసినదిగా కోరుచున్నారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులని రెగ్యులర్ చేయవలసినదిగా కోరుచున్నారు. పై సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిఎంఇకి వినతి పత్రం అందజేశారు. వీరిలో రాష్ట్ర డిప్యూటి జనరల్ సెక్రటరీ మరియు బ్రాంచ్ సెక్రటరీ అయిన బి స్వామిబాబు, బ్రాంచి అధ్యక్షులు కట్టిమేను మోహన్‌రావు, బ్రాంచి కోశాధికారి ప్రసన్నకుమార్ వినతి పత్రం అందచేశారు.

బంగారం పేరుతో రూ.3కోట్లు స్వాహా

విశాలాంధ్ర-కాట్రేనికోన: బంగారు నగలు చేసి ఇస్తానని మూడు కోట్ల రూపాయలు కాజేసి ముఖం చాటేయడంతో బాధిత కుటుంబాలు రోడ్ ఎక్కాయి. వివరాల్లోకి వెళితే కాట్రేనికోన గ్రామంలో కొన్నేళ్లుగా జ్యూయలర్ షాపు నిర్వహిస్తున్న అత్తిలి శ్రీధర్, శ్రీకాంత్ అన్నదమ్ములు మండలంలోని గ్రామాల్లో దాదాపు 300 మంది వద్ద మూడు కోట్ల రూపాయలు తీసుకొని బంగారు వస్తువులు చేసేస్తామని మూడేళ్లుగా వాయిదాలు వేస్తుండడంతో శనివారం ఉదయం బాధితు కుటుంబాలు కాట్రేనికోనకు ఒక్కసారిగా తరలివచ్చి నిందితులమ్మేసిన ఇంటి వద్ద ఆందోళన చేపట్టారు. చాలామంది వద్ద లక్షల రూపాయలు అప్పులు కూడా చేశారు. ఇదే సమయంలో నిందితుడు శ్రీధర్ మత్తు బిల్లలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కాట్రేనికోన ఎస్సై శ్రీనివాస్ రంగప్రవేశం చేసి నిందితులను, బాధితులను పోలీస్ స్టేషన్‌కు పిలిచి విచారణ చేపట్టారు. అయితే సాయంత్రం వరకు పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదులు అందలేదు. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి విచారణ చేస్తామని ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. నడవపల్లి గ్రామానికి చెందిన పోలవరపు వీరేశ్వర రావుతోపాటు మరో 300 మంది బాధితులు ఫిర్యాదులు ఇచ్చేందుకు సన్నద్ధమయ్యారు.

పశువులతో ప్రయాణికులకు ఇబ్బందులు

విశాలాంధ్ర-ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో పశువులతో ప్రయాణ ికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. ప్రధాన రహదారిపై రాత్రి సమయంలో ఆవులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. వాహనదారులు పలు ప్రమాదాలు గురవుతున్నారు. రహదారికి అడ్డంగా నిలబడి వాహనాలకు సైతం దారి ఇవ్వని పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు గుర్తించి ఆవులను కట్టడి చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

తోరం రమేష్‌కు నివాళి

విశాలాంధ్ర-అమలాపురం: ఇటీవల అనారోగ్యంతో మరణించిన తోరం రమేష్‌కు హెల్త్ అండ్ ఫిట్నెస్ జిమ్ అమలాపురంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నివాళులు అర్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎనుముల పద్మరాజు మాట్లాడుతూ జిమ్‌ను నిర్వహణతో పాటు మంచి శిక్షణ నైపుణ్యమును బాడీ బిల్డింగ్ క్రీడాకారులకు నేర్పి ప్రతిభగల క్రీడాకారులను అమలాపురం నుంచి అందించి, పోటీలను కూడా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేవాడని తెలిపారు. బాడీ బిల్డింగ్ జిల్లా ప్రెసిడెంట్ ఒంటెద్దు వెంకన్న నాయుడు మాట్లాడుతూ బాడీ బిల్డింగ్ కోచ్ అంటే ఇలా ఉంటారా అనే విధంగా ఉంటూ శిక్షణ పొందుతున్న క్రీడాకారులు కూడా క్రమ పద్ధతిలో కఠోర శిక్షణ ఇచ్చేవారని బాడీ బిల్డింగ్ క్రీడకు ఎంతో సేవ చేశారని తెలిపారు. అనంతరం తోరం రమేష్ ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అసోసియేషన్ మెంబర్స్ నగబేరి కృష్ణమూర్తి, గారపాటి చంద్రశేఖర్, చికురుమల్లి కిరణ్ కుమార్, చిక్కం రాజబాబు, నార్ని శీను, కురసాల శివ, సుంకర సుబ్బు, కంకిపాటి వెంకటేశ్వరరావు, జిమ్ క్రీడాకారులందరూ పాల్గొన్నారు.

రామిరెడ్డి ప్రకాష్‌కు సత్కారం

విశాలాంధ్ర - పిఠాపురం: మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు పురస్కరించుకొని వర్మాస్ కావ్య ఫౌండేషన్ ద్వారా ఎంసెట్ ఉచిత కోచింగ్ మెటీరియల్ ఇవ్వడం జరిగింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎంసెట్ ర్యాంకులలో మాధాపురం గ్రామానికి చెందిన రామిరెడ్డి ప్రకాష్ ఇంజనీరింగ్‌లో 1656 ర్యాంకు సాధించిన విద్యార్థిని సత్కరించారు. ఈ సందర్భంగా పిఠాపురం మాజీ శాసన సభ్యులు వర్మ మాట్లాడుతూ పిఠాపురంలో ప్రతిభ కలిగిన పేద విద్యార్థులు ఎందరో కలరని, వారు బాగా చదువు కోవాలనే ఉద్దేశ్యంతో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించామని, పేద విద్యార్థులు వర్మాస కావ్య ఫౌండేషన్ ద్వారా అందించే ఉచిత శిక్షణ తరగతులు ఎంతో బాగా ఉపయోగించుకున్నారని అన్నారు. ఉచిత శిక్షణ కార్యక్రమం మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు పుట్టిన రోజున మొదలు పెట్టడం, మాకు చాలా ఆనందంగా ఉందని అన్నారు. ర్యాంక్ సాధించిన రామిరెడ్డి ప్రకాష్, ఉపాధ్యాయులకు మరియు విద్యార్థులు కోచింగ్ నిమిత్తం కాలేజీ ఇచ్చిన మగాపు దైవం వారికీ పేరు పేరున ప్రత్యేక ధన్యవాదములు తెలిపి, ర్యాంకు సాధించిన విద్యార్థికి, ఉపాధ్యాయులకు సాలువ కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అల్లుమల్లు విజయ్ కుమార్, రెడ్డం భాస్కరరావు, సకుమళ్ళ గంగాధర్ రావు, బర్ల అప్పారావు, ఎలుబండి రాజారావు, జవ్వాది జోగేశ్వరరావు, నల్లా శ్రీను, అడ్డగార్ల శివ, బస్వా నాగ సత్తులు, నూలు సుబ్రహ్మణ్యం, బాబురావు, వీరా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

విశాలాంధ్ర-కాకినాడ/రామచంద్రపురం: రామచంద్రపురం పురపాలక సంఘం 25 వార్డులో ఉన్న మార్కెట్లో మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మాత్యులు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ తెలిపారు. శనివారం ఉదయం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గం రామచంద్రపురం పురపాలక సంఘం 12వ సచివాలయం పరిధిలోని 25 వ వార్డులో గడపగడపకు కార్యక్రమంలో మంత్రివర్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గడపగడపకు తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై లబ్ధిదారుల నుండి స్పందనను తెలుసుకున్నారు. ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాలు కుల, మతం భేదం లేకుండా పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు తమకు ఉన్న సమస్యలను మంత్రివర్యులు దృష్టికి తీసుకువచ్చారు. అందులో భాగంగా ఉన్న డ్రైనేజీ సమస్యలతో పాటు రోడ్లు సమస్య గురుంచి విద్యుత్తు లైట్లు పై మంత్రి దృష్టికి తీసుకురాగా డ్రైనేజీ సమస్య పరిష్కరించి తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డిని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి 25వ వార్డులో ఉన్న మార్కెట్‌ను సందర్శించి అక్కడ సమస్యలను స్థానిక వర్తకులు నుండి అడిగి తెలుసుకున్నారు. మార్కెట్లో మౌలిక సదుపాయాల కల్పన చేయాలని షాపుల్లో చేపట్టవలసిన మరమ్మతు పనులు చేపట్టాలని మునిసిపల్ కమిషనర్ కే శ్రీకాంత్ రెడ్డికు మంత్రి ఆదేశించారు. భారతదేశంలో ఏ రాష్ట్రం అందించలేని పథకాలను ఆంధ్రప్రదేశ్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి అందుతున్నాయని ప్రతి గడపగడపకి చేరుతున్నాయని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం పురపాలక సంఘం కమిషనర్ కే శ్రీకాంత్ లతోపాటు, 25వ వార్డు కౌన్సిలర్ కే కోటిపల్లి లక్ష్మీ శివాజీ ఇతర కౌన్సిలర్లు ప్రజా ప్రతినిధులు సచివాలయ సిబ్బంది తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

విశాలాంధ్ర-అమలాపురం: డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం జనుపల్లె గ్రామం నందు నూతనంగా 40 లక్షల రూపాయల ఉపాధి హామీ నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయం భవనమును రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ శనివారం ఉదయం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు గ్రామ సచివాలయ సిబ్బంది వాలంటరీలు తదితరులు పాల్గొన్నారు.

లంకూరులో దొమ్మికి దారితీసిన ఫోన్ సంభాషణ

విశాలాంధ్ర-సీతానగరం: లంకూరులో దొమ్మికి దారితీసిన ఫోన్ సంభాషణ. మండలంలో సీతానగరం గ్రామం లంకురు నందు రామాలయం వద్ద రాత్రి సమయంలో ఫోన్ మాట్లాడుతున్న విషయమై చెలరేగిన వివాదం రెండు వర్గాల (కాపు-వడ్డీ)మధ్య గొడవకు దారి తీసింది. దీనిలో సుమారు రెండొందలకు మంది పైగా ఒక్కసారిగా కొట్లాటకు దిగగా రాళ్లదాడి చేసుకోవడంతో సీతానగరం పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు కూడా ఏమి చేయలేక పోయారు. దీనితో పై అధికారులకు సమాచారం ఇవ్వగా కోరుకొండ నుండి అదనపు బలగాలు రంగప్రవేశం చేసి లాఠీలకు పని చెప్పి ఇరు వర్గాలవారిని చెదరగొట్టారు. ఈ గొడవ విషయమై కోరుమిల్లి పట్టాభి ఇచ్చిన ఫిర్యాదుపై ఏడుకొండలు రాము అతని తండ్రి పై ఇద్దరిపై కేసు నమోదు చేసారు. గొడవకు కారణాల పై పోలీసులు విచారణ చేస్తున్నారు. ఇది ఇలాగే ఉండగా గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న గొడవకు కారణమైన మరియు మద్యం మత్తులో వున్న యువకులు పోలీసుల దెబ్బకు పరారీ అయిపోయారు. ఏది ఏమైనా మండలంలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని పోలీసులు కఠినంగా వ్యవహరించి చర్యలు తీసుకోవాలని ప్రజలు, నాయకులు కోరుతున్నారు.

కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలి

విశాలాంధ్ర-గోపాలపురం: కష్టంతో కాకుండా ఇష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చాలని గ్రామ సర్పంచ్ నూతంగి సరోజినీ దేవి అన్నారు. శనివారం మండలంలోని చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు శాస్త్రి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించి మొదటి స్థానంలో ఉన్న నాబోతు లక్ష్మీ రజిత, 3000 రూపాయలు నగదు, మెడల్ ప్రశంసా పత్రాన్ని అందించారు. ద్వితీయ స్థానంలోని మాదుగుల రత్నకుమారికి 2000 రూపాయలు, తృతీయ స్థానం సాధించిన గొల్ల సత్యవతి కి 1000 రూపాయలు, గ్రామ సర్పంచ్ నూతంగి సరోజినీ దేవి, చేతుల మీదుగా అందిస్తూ, అభినందించి సత్కరించారు. అదేవిధంగా సైన్సులో ఇద్దరు విద్యార్థులకు ఒక్కొక్కరికి 1000 రూపాయలు చొప్పున సైన్స్ టీచర్ రాఘవ కుమారి నగదు బహుమతిని అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, నూతంగి.సరోజినీ దేవి,ఎంపీటీసీ, బూసి బేబీశ్వరి, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ పీతల ప్రసాద్ బాబు, ఏఎంసీ డైరెక్టర్ కొండేపాటి శ్రీనివాస్, సుందర్ రావు, గద్దె చంద్రశేఖర్, అరుణ కుమారి, కొలూరి సునీత, డేనియల్ రాజు, రమణ, శ్రీనివాసరెడ్డి, తేజస్విని, భీమేశ్వరరావు, రమేష్ మూర్తి, శ్రీదేవి.గ్రామ పెద్దలు, సి ఆర్ పి. కొయ్య నాగరాజు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జనవాణిలో వెల్లువలా సమస్యలు

విశాలాంధ్ర బ్యూరో-కాకినాడ: జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జిల్లాలో చేపట్టిన వారాహి యాత్ర దిగ్విజయంగా ముందుకు సాగుతున్న తరుణంలో ప్రతీ నియోజకవర్గానికి రెండు రోజులు సమయం కేటాయించి అనేక వర్గాల సమస్యల తెలుగుసుకుంటూ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుంది. శుక్రవారం రాత్రి పిఠాపురంలో బహిరంగ సభ అనూహ్య జయసందోహంతో ఇవిజయవంతం కావడంతో జనసేన నేతలు జోష్‌లో ఉన్నారు. రాత్రికి ఆకినాడకు చేరుకుని శనివారం స్థానిక ముత్తాక్లబ్‌లో జనవాణి జనం మధ్య జనం గోడు వింటూ ప్రతి సమస్యను ఓపికగా ఆలకిస్తూ పరిష్కారానికి భరోసా ఇస్తూ..జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కాకినాడలో జనవాణి-జనసేన భరోసా కార్యక్రమంలో పాల్గొన్నారు. వైసీపీ ఎమ్మెల్యేల దాష్టికాల బాధితులు. జయలక్ష్మి బ్యాంకులో డిపాజిట్లు కట్టి దగా పడ్డ రిటైర్డ్ ఉద్యోగులు.. పారిశుధ్య కార్మికులు, రజకులు, భవన నిర్మాణ కార్మికులు, కరెంటు బిల్లు ముసుగులో ఫించన్ కోల్పోయిన దివ్యాంగులు, టిడ్కో గృహాల బాధితులు, శాసనభ్యుల అరాచకాలకు ఇబ్బందులు పడుతున్న బాధితులు తమ కన్నీటి గాధలు పవన్ కళ్యాణ్‌కి చెప్పుకున్నారు. ప్రతి ఒక్కరి ఆవేదనను ఆలకించిన పవన్ కళ్యాణ్ నేనున్నానంటూ జనవాణిలో సమస్యలు చెప్పుకొనేందుకు వచ్చిన అందరికీ ధైర్యం చెప్పారు. వైసీపీ ప్రభుత్వ అరాచకాలపై, ప్రజా సమస్యలపై గళం విప్పుతానని భరోసా ఇచ్చారు. ఫించన్ కోల్పోయిన దివ్యాంగుడు మాడం శ్రీనివాస్‌కి వీల్ చైర్ కొనివ్వడంతో పాటు ఆర్థికంగా అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. సమస్యలతో వచ్చిన ప్రతి ఒక్కరు మీరు ముఖ్యమంత్రి కావాలి సర్ అంటూ నిండు మనసుతో పవన్ కళ్యాణ్‌ని దీవించారు. కాకినాడ పట్టణ, రూరల్ నియోజకవర్గాల పరిధిలో శనివారం నిర్వహించిన జనవాణి-జనసేన భరోసా కార్యక్రమంలో 50కి పైగా సమస్యలపై అర్జీలు స్వయంగా స్వీకరించారు.

అక్రమ మట్టి ట్రాక్టర్లను అదుపు చేయరా?

విశాలాంధ్ర-కాట్రేనికోన: కాట్రేనికోన మండలంలో మట్టి మాఫియాకు అడ్డాగా మారింది. నిత్యం మట్టి ట్రాక్టర్‌లు రోడ్లపై స్వైరవిహారం చేస్తున్నాయి. పరి మితికి మించి మట్టి లోడుతో పరుగులు పెడుతున్నాయి. చెవుల్లో ఇయర్ ఫోన్లు పెట్టుకుని, పక్కన సౌండ్ బాక్షులు ద్వారా పాటలను వింటూ మలుపుల్లో కూడా కళ్ళెం లేని గుర్రం లా పరుగులు తీస్తుంటే వాహనాలు దారులు, పాదాచారులు హడలెత్తిపోతున్నారు. పాఠశాలలు కు వెళ్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు ఈవిషయమై ఆందోళన చెందుతున్నారు. రోడ్డుపై వెళుతున్న యువకుడిని పక్కనుండి వచ్చిన మట్టి ట్రాక్టర్ ఢీకొనడంతో ఆసుపత్రికి పాలైన సంఘటన ఇటీవల దొంతికుర్రులో జరిగింది. ట్రాక్ట ర్లలు నడిపే వారికి డ్రైవింగ్ లైసెన్స్, ఇతర పర్మిట్లు ఏమీ ఉండవు. అయినా పోలీసులు పట్టించుకోరు. రోజు పోలీసులు మాత్రం ద్విచక్ర వాహనదారులకు లేనిపోని కారణా లతో ఫైన్లు వేస్తూ అప్పటికప్పుడే నిర్బంధంగా వసూలు చేస్తున్నారు. ఫైన్ చెల్లిస్తేనే గాని వాహనాలు ఇవ్వకపోవడంతో వారు నిరసన తెలుపుతున్నారు. నిబంధనలకు విరు ద్ధంగా తిరిగే టాక్టర్లను నియంత్రించవలసిన రవాణాశాఖ సిబ్బందికి తీరిక దొరకడంలేదు. స్థానిక పోలీసులకు పట్టడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.